క్లుప్తంగా

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

ఏసీపీ రవికిరణ్



నందిగామ: ఎన్నికల నేపథ్యంలో అనవసరంగా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ బి.రవికిరణ్ హెచ్చరించారు. నందిగామ పట్టణంలోని మెయిన్ బజార్‌తో పాటు పలు ప్రధాన వీధులలో మంగళవారం రాత్రి ప్రత్యేక పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఎన్నికలలో ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకే ప్రత్యేక పోలీసు బలగాలతో కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరిలో ధైర్యం నింపేందుకే పోలీసు కవాతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో అనవసరంగా వివాదాలకు పాల్పడి ఇబ్బందులు పడవద్దని సూచించారు. ఈ కవాతులో ఇన్‌స్పెక్టర్ హనీష్, ఎస్‌ఐ పండుదొర, ప్రత్యేక పోలీసు బలగాలు పాల్గొన్నారు.

పద్మావతికి భారత మహిళా శిరోమణి పురస్కారం



జగ్గయ్యపేట అర్బన్: ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ చారుగుండ్ల కొండ సతీమణి పద్మావతికి భారత మహిళా శిరోమణి సేవా పురస్కారం అవార్డు లభించింది. ఇంటర్నేషనల్ ఉమెన్స్‌డే సందర్భంగా విజయవాడ గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో లయన్స్‌క్లబ్ గీతాంజలి, ఎక్స్‌రే సాహిత్య సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో విజయనగరం ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి గూడూరి రజని, సినీ హాస్యనటుడు కాదంబరి కిరణ్ చేతుల మీదుగా పురస్కారాన్ని మంగళవారం అందుకున్నట్లు కొండ తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, ఆయన సతీమణి విమలాభాను ఫౌండేషన్ చైర్‌పర్సన్ సామినేని విమలాభాను, న్యాయవాది సామినేని వెంకటేశ్వరరావు, పేట నియోజకవర్గ ఆర్యవైశ్యులు హర్షం వ్యక్తం చేశారు.

పింఛన్ల పంపిణీపై సమీక్ష

చిల్లకల్లు(జగ్గయ్యపేట): మండలంలో ఈ నెలకు సంబంధించిన పింఛన్ల పంపిణీని బుధవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీవో రమేష్ బాబు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పింఛన్ల పంపిణీపై కార్యదర్శులతో మంగళవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 19 గ్రామ సచివాలయాల ద్వారా అన్ని రకాల పింఛన్‌లను పంపిణీ చేస్తామన్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్ని సచివాలయాలలో లబ్ధిదారుల జాబితా ప్రకారం ఉదయం ఏడు నుంచి రాత్రి ఏడు గంటల వరకు పింఛన్‌లు అందిస్తామని తెలిపారు. లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలో కార్యదర్శులు శ్రావణ్, నరసింహారావు, శివాజీ, జగ్గయ్య, నాగేశ్వరరావు, సంక్రాంత్, తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం ఇవ్వాలి

తిరువూరు: రాష్ట్ర ప్రజా రవాణా శాఖలో అద్దె బస్సులపై డ్రైవర్లుగా పనిచేస్తున్న వారికి కనీస వేతనాలు ఇవ్వాలని అద్దె బస్సు డ్రైవర్ల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. తులసీరాం ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవన్‌లో అద్దె బస్సు డ్రైవర్ల యూనియన్ సమావేశం జరిగింది. నెలకు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ప్రభుత్వ నిబంధనల మేరకు పీఎఫ్, ఈఎస్‌ఐ సదుపాయాలు కల్పించాలని కోరారు. యూనియన్ నాయకులు వెంకటేశ్వరరావు, రవి, మధుబాబు, మణికంఠ, రాధాకృష్ణ, భద్రం పాల్గొన్నారు.

దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు అందజేత



ఆగిరిపల్లి: వైకల్యాన్ని అధిగమించి జీవితంలో అనుకున్న లక్ష్యాలను ధైర్యంగా సాధించాలని దీపక్ నెక్స్‌జెన్ ఫుడ్ అండ్ ఫీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ వెంకట సుబ్రహ్మణ్యం అన్నారు. తోటపల్లి హీల్ అవయవ కేంద్రంలో ముగ్గురు దివ్యాంగులకు ఆయన కృత్రిమ కాళ్లను అందజేశారు. కార్యక్రమంలో హీల్ క్యాంపస్ చైర్మన్ పిన్నమనేని ధనప్రకాష్, కార్యదర్శి తాతినేని లక్ష్మి, దీపక్ నెక్స్ జెన్ కంపెనీ డైరెక్టర్లు చైతన్య, అక్కినేని వెంకట శేషాద్రి పాల్గొన్నారు.

పేదల సంతోషం చూడలేవా బాబు..!



ముచ్చింతాలకు చెందిన వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ (ఫైల్)



ఈ ఫొటోలో కనిపిస్తున్న వృద్ధురాలి పేరు పిడతల వెంకటనర్సమ్మ. భర్త పేరు రంగయ్య. కొడుకులు లేరు. కూతుళ్లకు పెళ్లి అయిపోవటంతో ముసళోళ్లు ఇద్దరే ఉంటున్నారు. వెంకటనర్సమ్మ మంచంలో నుంచి లేచే పరిస్థితి లేదు. రంగయ్య కూడా నడవలేని స్థితిలో ఉన్నాడు. వీరికి పింఛనే ఆధారం. ఈనెల మొదటి తారీకు పింఛన్ రాకపోవటంతో తల్లడిల్లుతున్నారు. పింఛన్లు రాకుండా అడ్డుకుంటే మాలాంటి వాళ్ల పరిస్థితి ఎవరు పట్టించుకుంటారని వాపోతున్నారు.

కంచికచర్ల/నందిగామ/పెనుగంచిప్రోలు: ఈనెల పింఛన్ వలంటీర్లు ఇంటికి తెచ్చి ఇవ్వరన్న వార్తలు అవ్వాతాతలు, దివ్యాంగుల గుండెల్లో గుబులు రేపుతోంది. ప్రతిపక్ష నేత చంద్రబాబు ఆయన అనుచరుల వరుస ఫిర్యాదులతో సార్వత్రిక ఎన్నికలు ముగిసేవరకు వలంటీర్ల సేవలు నిలిపివేయాలని ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో ప్రజలకు వలంటీర్ల సేవలు నిలిచిపోయాయి. ఇందుకు చంద్రబాబు అండ్ కో కారణమని తెలుసుకుని పింఛన్‌దారులు మండి పడుతున్నారు. బాబు పాలనలో పింఛన్ కోసం గ్రామ పంచాయతీల చుట్టూ కాళ్లరిగేలా తిరిగి నానాపాట్లు పడ్డ విషయాన్ని గుర్తుకు తెచ్చుకుని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటి వరకు 1వ తేదీన పొద్దు పొడవక ముందే వలంటీర్లు ఇంటికి వచ్చి ఇచ్చేవారని, ఇప్పుడు చంద్రబాబు వారి అనుచరులు వలంటీర్లను తొలగించేందుకు కుట్ర పన్నటం బాధాకరమన్నారు. అవ్వాతాతల మాటల్లో..

కష్టాలపాలు చేయటం తగదు



ఐదేళ్లు నుంచి ప్రతి నెల ఒకటో తేదీన వలంటీర్లు ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చేవాళ్లు. చంద్రబాబు కుట్రపన్ని కష్టాలకు గురిచేస్తున్నాడు. పింఛన్‌లు నేరుగా తమ ఇళ్ల వద్దకు వచ్చి అందించే వలంటీర్లను డబ్బులు ఇవ్వకుండా అడ్డుకోవటం చంద్రబాబు దుర్మార్గం బయటపడింది. మా ఉసురు తగలకపోదు.

–వలసాని జ్వాలా నరసింహ, వృద్ధాప్య పింఛనుదారు, వేములపల్లి

బురద జల్లటం దుర్మార్గం



టీడీపీ అనుచరులు ఫిర్యాదు చేస్తే పింఛన్లు పంపిణీ చేయరాదంటూ ఎన్నికల కమిషన్ చెప్పటం విడ్డూరంగా ఉంది. మాలాంటి వారి బతుకులు ఏం కావాలి. ఆడబ్బులు వస్తేనే నాలుగు మెతుకులు నోట్లోకి పోతాయి. ప్రతిపక్ష పార్టీలు వలంటీర్లపై లేనిపోని బురద జల్లటం దుర్మార్గం.

–సంగం సీతమ్మ, వితంతు పింఛనుదారు, వేములపల్లి

గతంలో పడిగాపులు పడ్డాం..



గత ప్రభుత్వంలో పింఛన్ డబ్బుల కోసం పంచాయతీ కార్యాలయం వద్ద పడిగాపులు పడేదాన్ని పొద్దున్నే పోయినా పింఛన్ వచ్చేది కాదు. సర్వర్ పనిచేయటంలేదని రెండు, మూడు రోజులు వెళ్లేదాన్ని ఇప్పుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత వలంటీర్ ఇంటికి వచ్చి పింఛన్ ఇస్తున్నారు. అటువంటి వలంటీర్లను తొలగించటం బాధాకరం.

–మార్కపూడి కౌశల్య, వృద్ధాప్యపింఛనుదారు, గండేపల్లి

మంచం మీద నుంచి కదలలేను



మాలాంటి వాళ్లనేనా పింఛన్ కోసం ఇబ్బంది పెట్టేది. సచివాలయాని వెళ్లి పింఛన్ తెచ్చుకోగలమా..? మాకు ప్రతినెలా ఒకటో తేదీ నాడు ఉదయాన్నే మా వలంటీర్ ఇంటికి వచ్చి పింఛన్ అందజేసేవారు. ఈ నెలలో సచివాలయం వద్దకు వెళ్లి తెచ్చుకోవాలి అని చెప్తున్నారు. నాలాంటి వాళ్ల పరిస్థితి ఏంటో అర్థం కావడం లేదు.

–మానుకొండ శ్యామలమ్మ, పల్లగిరి, నందిగామ మండలం

పింఛన్ ఎలా తెచ్చుకోవాలో..



ఒకపక్క ఎండలు మండుతున్నాయి. వలంటీర్ పింఛన్ అందజేయకపోతే సచివాలయానికి వెళ్లి ఈ ఎండలో పింఛన్ ఎలా తెచ్చుకోవాలో అర్థం కావడం లేదు. నా వయసు 87 సంవత్సరాలు. ఈ వయసులో ఎండలో పింఛన్ తెచ్చుకోవడం అంటే భయమేస్తోంది. మా పిల్లల వెంట వచ్చినా గాని నాలో ఓపిక ఉండాలిగా. ఏంటో మాలాంటి వాళ్లని ఇబ్బంది పెడితే ఏమొస్తుందో.

–ఈదా వెంకట సుబ్బమ్మ, వృద్ధురాలు, పల్లగిరి, నందిగామ మండలం

చంద్రబాబుకు గుణపాఠం చెప్పాలి

మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పక్కన అల్లూరి భాస్కర్

జగ్గయ్యపేట అర్బన్: మాటిమాటికీ ఎస్సీలను అవహేళన చేస్తూ వారి ఆత్మగౌరవం దెబ్బతినే విధంగా మాట్లాడుతున్న చంద్రబాబునాయుడుకు వచ్చే మే నెల 13వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో దిమ్మతిరిగే విధంగా గుణపాఠం చెప్పాలని మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ నేత అల్లూరి భాస్కర్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ ఇటీవల అనంతపురం జిల్లా శింగనమల వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎస్సీ వర్గానికి చెందిన టిప్పర్ డ్రైవర్ వీరాంజనేయులు ఎడమ చేతితో వేలిముద్ర వేసే నిశానని అంటూ అంటూ టీడీపీ అధినేత చంద్రబాబు అవహేళన చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ వ్యాఖ్యలు చంద్రబాబు కుల దురహంకారానికి నిదర్శనం అన్నారు. గతంలో కూడా దళితులుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అని చంద్రబాబు మాట్లాడారని, దళితుల పట్ల చులకన భావం ఉన్న చంద్రబాబుకు దళితుల పవర్ ఏంటో ఈ ఎన్నికల్లో మరొకసారి రుచిచూపించాలని పిలుపునిచ్చారు. వీరాంజనేయులును అవమానకరంగా మాట్లాడిన చంద్రబాబుపై ఎన్నికల సంఘం స్పందించి ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుచేయాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ ఆశయాలను నిజం చేస్తూ అట్టడుగు వర్గాలను చట్టసభలకు పంపేందుకు విద్యాధికుడైన టిప్పర్ డ్రైవర్‌కు ఎమ్మెల్యేగా టికెట్ ఇచ్చి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గౌరవించారన్నారు. పెత్తందార్లు, భూస్వామ్య మనస్తత్వం ఉన్న చంద్రబాబుకు ఇది నచ్చక కడుపులో మంటగా ఉందన్నారు. ఇది అంబేద్కర్ రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడమేనని తెలిపారు. డ్రైవర్లంతా వచ్చే ఎన్నికల్లో సైకిల్‌ను టిప్పర్ కింద వేసి తుక్కుతుక్కు చేస్తారని తెలిపారు. ఉపాధి కూలీకి, టిప్పర్ డ్రైవర్‌కు టికెట్లు ఇచ్చిన లీడర్‌గా సీఎం జగనన్న రాష్ట్ర చరిత్రలో, దళితుల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని తెలిపారు.

జగన్ మళ్లీ సీఎం కావాలని శ్రీశైలంలో పూజలు



శ్రీశైలంలో పల్లగిరి గ్రామ నాయకులు

నందిగామ: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి రావాలని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని పార్టీ నాయకులు మొక్కుకున్నారు. మండలంలోని పల్లగిరి గ్రామానికి చెందిన పలువురు పార్టీ నాయకులు మంగళవారం నల్గొండ జిల్లా జాన్ పహాడ్, శ్రీశైలం క్షేత్రాలకు వెళ్లారు. గ్రామ సర్పంచ్ రవికిరణ్, గ్రామ పార్టీ నాయకుడు కృష్ణారెడ్డిలతోపాటు పలువురు గ్రామస్తులు ఆయా క్షేత్రాలకు వెళ్లి మొక్కుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రవికిరణ్‌రెడ్డి మాట్లాడుతూ ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా పథకాలు పెట్టి ప్రతి కుటుంబం ఆర్థికంగా బలపడేలా చూస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి మరోమారు సీఎం కావాలని, నందిగామ నియోజకవర్గంలో డాక్టర్ మొండితోక జగన్మోహన్‌రావు మరోసారి ఎమ్మెల్యేగా గెలవాలని కోరుతూ ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

మైలవరం: మైలవరం బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఏడీ ప్రసాద్ ఎన్నికయ్యారని అసోసియేషన్ మీడియా కమిటీ కన్వీనర్ బుద్ధవరపు వెంకట్రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైలవరం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక స్థానిక బార్ అసోసియేషన్ హాల్లో జరిగింది. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా వీటీ కిషోర్, ఉపాధ్యక్షుడిగా వీవీ సాంబశివరావు, సహాయ కార్యదర్శిగా ముల్లంగి రవికుమార్, లైబ్రేరియన్‌గా బి. దినేష్, కోశాధికారిగా టి.కోటేశ్వరరావు, మహిళా కార్యదర్శిగా నాగులూరి భావన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. అదే విధంగా మీడియా కన్వీనర్‌గా బుద్ధవరపు వెంకట్రావు, క్రమశిక్షణ కమిటీ, మానవ హక్కుల కమిటీ, బిల్డింగ్ అభివృద్ధి కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కోడ్ ఉల్లంఘన.. ఇద్దరిపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి పవన్‌కల్యాణ్, పోతిన మహేష్ ఫ్లెక్సీలతో సంతకాల సేకరణ చేస్తున్న ఇద్దరిపై కొత్తపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎర్రకట్ట రోడ్డు పరిధిలోని ప్రైజర్‌పేట కటికల వారి వీధి వద్ద మల్లికార్జునపేటకు చెందిన బైపు రామకృష్ణ, కేఎల్‌రావునగర్‌కు చెందిన లండా ప్రశాంత్ కలిసి పవన్‌కల్యాణ్, పోతిన మహేష్‌ల ఫ్లెక్సీలతో సంతకాల సేకరణ చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఘటనా స్థలానికి చేరుకునే సరికి రోడ్డుపై వెళ్లే వారిని ఆపి, ఇద్దరికి మద్దతుగా సంతకాల సేకరణ చేస్తున్నట్లు టీం సభ్యులు గుర్తించారు. సంతకాల సేకరణ చేస్తున్న వారు ఎన్నికల రిటర్నింగ్ అధికారి నుంచి ఏమైనా అనుమతి తీసుకున్నారా అని ప్రశ్నించారు. అయితే ఎటువంటి అనుమతి తీసుకోలేదని సదరు యువకులు పేర్కొనగా, వారిపై కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ గణేష్ కేసు నమోదు చేశారు.

రేపటి నుంచి స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ తరగతులను నిర్వహించనున్నామని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఏ.పూర్ణిమ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4 తేదీ నుంచి కటింగ్ అండ్ టైలరింగ్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, డ్రెస్ డిజైనింగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, ఎలక్ట్రికల్ టెక్నీషియన్, మెషిన్ ఎంబ్రాయిడరీ, ఏసీ, రిఫ్రిజిరేటర్ మెకానిజం, హోమ్ క్రాఫ్ట్స్, జ్యూస్ అండ్ జామ్ మేకింగ్, టెక్స్‌టైల్ ప్రింటింగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, మిర్రర్ వర్క్ అంశాల్లో శిక్షణ తరగతులు జరుగుతాయని వివరించారు. ఆసక్తి ఉన్న యువతీ యువకులు విజయవాడ మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్‌లోని తమ సంస్థ కార్యాలయంలో నేరుగా కాని 0866–2470420 నెంబర్‌లో కాని సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

భక్తిశ్రద్ధలతో పూజలు

పెంట్యాలవారిగూడెం(వత్సవాయి): గ్రామంలో నూతనంగా నిర్మాణం చేసిన శ్రీ కోదండరామ, దాసాంజనేయ, ముత్యాలమ్మ, అంకమ్మ, గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ, యల్లయ్య, నాభిశిల ప్రతిష్టామహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం విష్వక్సేనారాధన, పుణ్యాహవచన, పంచామృత స్నపన, సామూహిక కుంకుమపూజ కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ధాన్యాధివాసం, పుష్పాధివాసం, ప్రభూతబలి, గమిడి దిగ్బంధన వంటి కార్యక్రమాలు చేశారు. ప్రతిష్టా మహోత్సవాలను పురస్కరించుకుని గ్రామంలోని ప్రతి ఇల్లు బంధువులతో నిండిపోయింది. దూరప్రాంతాలలో స్థిరపడిన వారు గ్రామానికి చేరుకున్నారు. బుధవారం ఉదయం 9 గంటలకు ప్రతిష్టాకార్యక్రమం జరగనుంది. ఎస్‌ఐ బి.అభిమన్యు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కొనసాగుతున్న పోలీస్ పికెట్

పెనుగంచిప్రోలు: గ్రామంలో నాలుగు రోజుల క్రితం జరిగిన కత్తుల దాడి ఘటన నేపథ్యంలో ఉద్రిక్తత పరిస్థితులు చోటు చేసుకుంటున్నాయి. దీంతో పోలీసులు గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీల్లో ముందస్తు చర్యల్లో భాగంగా పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. మంగళవారం కూడా బందోబస్తు నిర్వహించారు. రెండు కాలనీల్లో 24 గంటలు స్థానిక పోలీసులతో పాటు ప్రత్యేక బలగాలు పహరా కాస్తున్నారు. నందిగామ ఏసీపీ రవికిరణ్ ఆధ్వర్యంలో జగ్గయ్యపేట సీఐ జానకిరామ్, ఎస్‌ఐ పి.రాంబాబు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారు.

రెండు ఇసుకలోడు ట్రాక్టర్లు సీజ్

నందిగామ: అనుమతులు లేకుండా మున్నేటి నుంచి ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను నందిగామ పోలీసులు మంగళవారం సీజ్ చేశారు. ఎస్‌ఐ దుర్గా మహేశ్వరరావు తెలిపిన సమాచారం ప్రకారం.. మండలంలోని మాగల్లు సమీపంలో మున్నేటి నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో తనిఖీలు నిర్వహించామన్నారు. ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నేడు విగ్రహాల ప్రతిష్ట మహోత్సవం

విస్సన్నపేట: నూతిపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామ లక్ష్మణ ఆంజనేయ జయ విజయ శిఖర శిలా ధ్వజ గ్రామ నాభిశిల, ముత్యాలమ్మ దేవతామూర్తులు, యంత్ర స్థిర ప్రతిష్ట మహోత్సవం బుధవారం ఉదయం 9.18 గంటలకు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ప్రతిష్ట మహోత్సవం అనంతరం అన్నసమారాధన జరుగుతుందన్నారు.

సరిహద్దు చెక్‌పోస్టు తనిఖీ

పెద్దాపురం(వీరులపాడు): మండలంలోని అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద కట్టుదిట్టంగా తనిఖీలు చేస్తున్నామని నందిగామ రూరల్ సీఐ చంద్రశేఖర తెలిపారు. మండలంలోని పెద్దాపురం గ్రామ సమీపంలోని అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టును మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోకి వచ్చే ప్రతి ఒక్క వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. ముఖ్యంగా మద్యం, నగదు, మాదకద్రవ్యాలు, తదితరాలు అక్రమ రవాణా కాకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అక్రమ రవాణాకు పాల్పడుతూ పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ మహాలక్ష్మణుడు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు మాయం

పెనుగంచిప్రోలు: గడిచిన వారం రోజుల వ్యవధిలో గ్రామంలో ద్విచక్ర వాహనాలు మాయమవుతున్న ఘటన ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటి వరకు నాలుగు బైక్‌లు మాయం కాగా, తాజాగా సోమవారం మధ్యాహ్నం పోలీస్‌స్టేషన్ వెనుక సందులో బుల్లెట్ కూడా గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. అయితే వీటికి సంబంధించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రెండు ఫిర్యాదులు మాత్రమే అందాయని పోలీసులు తెలిపారు. బుల్లెట్ వాహనం తీసుకెళ్తున్న దృశ్యాలు సీసీ కెమేరాలో రికార్డు అయ్యాయి. అయితే తీసుకెళ్తున్న వ్యక్తి ముఖం స్పష్టంగా కనిపించటం లేదు. వరుస దొంగతనాలు అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మరోసారి అండగా నిలిచి ఆశీర్వదించండి

ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: తనపై నమ్మకంతో ఓట్లేసి గెలిపించిన ప్రజల అవసరాలు తెలుసుకుని వాటిని సాకారం చేసేలా ప్రజా సేవకుడిలా పని చేశానని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. పట్టణంలోని 12వ వార్డు పరిధిలోని రామలింగేశ్వర నగర్, కాకతీయ పాఠశాల, తదితర ప్రాంతాలలో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించి రానున్న ఎన్నికలలో సైతం అండగా నిలిచి ఆశీర్వదించాలని కోరారు. ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లిన ఎమ్మెల్యేకు మహిళలు హారతులిచ్చి ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ గడిచిన మూడు దశాబ్దాల కాలంలో జరగనంత అభివృద్ధిని ఐదేళ్ల పాలనలో చేసి చూపించానన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో కులమతాలు, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించామని జగన్‌మోహనరావు పేర్కొన్నారు. శాసనసభ్యునిగా మంచి చేశానని భావిస్తే మరోసారి అండగా నిలిచి ఆశీర్వదించాలని జగన్‌మోహనరావు కోరారు. ఈ ఐదేళ్లలో నేను ఏది చేసినా ప్రజల పూర్తి సహకారంతోనే చేయగలిగానని చెప్పారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు కోవెలమూడి వెంకట నారాయణ, వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి చల్లా బ్రహ్మేశ్వరరావు, పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, వార్డు కన్వీనర్ కోమటి రవికుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఓర్సు లక్ష్మి, నాయకులు బొంతు సతీష్‌రెడ్డి, చిరుమామిళ్ల చైతన్యకుమార్, గుడివాడ సాంబశివరావు, నెలకుదిటి శివనాగేశ్వరరావు, వైఎస్ఎన్ ప్రసాద్, ఓర్సు జ్వాలా, పాకాలపాటి కిరణ్, వినుకొండ రామారావు, షేక్ ఫాతిమా, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొత్తు పార్టీలను చిత్తు చేసేందుకు సిద్ధంగా ప్రజలు

- ఎమ్మెల్సీ అరుణకుమార్
- నాలుగవ వార్డులో వైఎస్సార్ సీపీలోకి చేరికలు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్సీ అరుణకుమార్

నందిగామ టౌన్: పొత్తుల పార్టీలను రానున్న ఎన్నికలలో చిత్తు చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని శాసన మండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణ కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని నాలుగవ వార్డుకు చెందిన 20 కుటుంబాల వారు మంగళవారం టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్సీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా అరుణకుమార్ మాట్లాడుతూ నాయకులు డబ్బులకు అమ్ముడుపోయి పార్టీలు మారుతుంటే ప్రజలు మాత్రం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రజాపాలనకు ఆకర్షితులై వైఎస్సార్ సీపీలో చేరుతున్నారన్నారు. వైఎస్సార్ సీపీ పేదల పార్టీ అని ప్రజా మద్దతు ఎప్పుడు తమకే ఉంటుందని తెలిపారు. గత ఎన్నికలలో వచ్చిన మెజార్టీ కన్నా అత్యధిక మెజార్టీలో పార్టీ అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావును గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేసి పార్టీ అభివృద్ధికి, విజయానికి కృషి చేయాలని కోరారు. రానున్న ఎన్నికలలో వైఎస్సార్ సీపీ అభ్యర్థిని గెలిపించి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా అందించేందుకు సైనికుల్లా పని చేయాలని ఆకాంక్షించారు. నాయకులు మువ్వల శ్రీను, ఓర్సు జ్వాలా, నల్లమల్లి మురళి, సూరె రామారావు, బండారు శేషు, కొండ, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేషనల్ క్రికెట్ అకాడమీకి విద్యార్థి ఎంపిక



రాజేష్‌కు షూస్ అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ డీఆర్‌కె.ప్రసాద్, కోచ్ రాజేంద్ర

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని అమ్మాణీ కళాశాలలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం చదువుతూ స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ క్రీడామైదానంలో బీవీ సాగర్ స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్, ఏసీఏ, కేడీసీఏ క్రికెట్ అకాడమీ నెట్స్‌లో 5 ఏళ్లుగా శిక్షణ పొందుతున్న నల్లపు రాజేష్ నేషనల్ క్రికెట్ అకాడమీకి ఎంపికయ్యాడు. ఇటీవల అస్సాం గౌహతిలో జరిగిన అండర్–16 ఆలిండియా బీసీసీఐ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టుకు నల్లపు రాజేష్ ప్రాతినిధ్యం వహించాడు. ఈ టోర్నమెంట్‌లో హాఫ్ స్పిన్ బౌలర్‌గా 30 వికెట్లు తీసుకోవడం వలన నేషనల్ క్రికెట్ అకాడమీకి ఎంపికయ్యాడు. కాగా ఈ నెల 18వ తేదీ నుంచి మే 18 వరకు ముంబాయిలో జరుగు శిక్షణా కార్యక్రమంలో పాల్గొననున్నాడు. ఈ సందర్భంగా మంగళవారం నల్లపు రాజేష్‌కు ఆశిస్ జాగర్స్ షూస్‌ను స్థానిక లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్ అందజేసినట్లు కోచ్ రాజేంద్ర తెలిపారు.

శ్మశానవాటికలో జంగిల్ క్లియరెన్స్



శ్మశానవాటికలో జంగిల్ క్లియరెన్స్ పనులు

ముసునూరు: యువకుల చొరవ, దాతల సహకారంతో ముసునూరులోని దళితుల శ్మశానవాటికలో జంగిల్ క్లియరెన్స్ పనులు నిర్వహించారు. ముసునూరులోని దళితవాడ శ్మశానవాటిక తుమ్మ, జిల్లేడు చెట్లు, ముళ్లకంపలతో నిండి మృతదేహాలను ఖననం చేయడానికి వీలులేనంతగా మారింది. ఇటీవల ఓ మృతదేహాన్ని ఖననం చేసేందుకు వెళ్లిన యువకులు శ్మశానవాటికలో సమస్యను గుర్తించి రైతు ప్రముఖులు రేగుల బ్రదర్స్ గోపాలకృష్ణ, లోకేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లారు. తక్షణమే స్పందించిన రేగుల బ్రదర్స్ మంగళవారం జేసీబీతో శ్మశానవాటికలో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. శ్మశానవాటిక అంతర్గత రహదారుల్లో గోతులను సైతం పూడ్పించారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన రేగుల బ్రదర్స్, యువకులు గొల్లపల్లి సురేష్, మద్దాల బాబూరావు, రమేష్, రామారావు, గంగాధర్‌లకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

ఎంపీడీఓ అనూరాధ



మాట్లాడుతున్న ఎంపీడీఓ అనూరాధ

ఇబ్రహీంపట్నం: వేసవిలో తాగునీటి ఎద్దడి, వడదెబ్బ నివారణ చర్యలపై ఎంపీడీఓ అనూరాధ వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మండలంలో 135 చేతిపంపులు ఉండగా 25 రిపేరులో ఉన్నాయన్నారు. వివిధ గ్రామాల ఎంపీపీ పాఠశాలల్లో 8 చేతి పంపులు ఫ్లషింగ్ చేయాల్సి ఉందన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మరమ్మతు చర్యలు చేపట్టాలని సూచించారు. వడదెబ్బ తగిలిన వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పీహెచ్‌సీ వైద్యురాలు వివరించారు. ఉపాధి హామీ పథకం కూలీలు ఉదయం, సాయంత్ర వేళల్లో పనులకు హాజరుకావాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు దగ్గర ఉంచుకోవాలని చెప్పారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.